సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



ప్రమాద బీమా రూ.10 లక్షలు

కార్మిక సంక్షేమ శాఖలో పేర్లు నమోదు చేసుకుని, లేబర్‌కార్డు పొందిన కార్మికులకు ప్రమాద బీమా రూ.10 లక్షలు అందనుంది.

8లో



..ఆదాయం రూ.29.10 లక్షలు

కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ జాతర ఆదాయం రూ.29.10 లక్షలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

8లో

గరిష్టం / కనిష్టం
32° / 23°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం పల్లకీసేవగా చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్య కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు చండీహోమం

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీ హోమం నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. పూజలో పాల్గొన దలచిన భక్తులు రూ.2,516 చెల్లించి గోత్ర నామాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మేడారంలో మ్యూజియం ఏర్పాటుకు సన్నాహాలు



మ్యూజియాన్ని పరిశీలిస్తున్న వసంతరావు

భద్రాచలంఅర్బన్: వనదేవతలు కొలువై ఉన్న మేడారంలోనూ భద్రాచలం తరహాలో గిరిజన మ్యూజియం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఏటూరునాగారం ఐటీడీఏ ఏపీఓ జనరల్ వసంతరావు అన్నారు. భద్రాచలంలో ఐటీడీఏలో ఏర్పాటు చేసిన మ్యూజియాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతరించి పోతున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఇలాంటి మ్యూజియాలు ఉపకరిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజు, ఏటూరునాగారం ఐటీడీఏ ఏఓ రాజ్‌కుమార్, ఎస్‌ఓ సురేష్, ఏఈ ప్రసాద్, డీఎస్‌ఓ ప్రభాకర్‌రావు, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా మాస్‌లైన్



మాట్లాడుతున్న పోటు రంగారావు

గుండాల: పేదల పక్షాన పోరాడుతూ, నిరంతరం ప్రజలకు అండగా ఉండే పార్టీ సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ అని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గుండాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక జెడ్పీటీసీగా మూడుసార్లు ఎన్నికైన దివంగత నేత బాటన్న మండల అభివృద్ధికి కృషి చేశారని, రూ.కోట్లు ఇస్తామని ఆశ చూపినా అమ్ముడుపోకుండా పేదలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రజల పక్షాన నిలబడే మాస్‌లైన్ అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు. సమావేశంలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు చంద్ర అరుణ, మాచర్ల సత్యం, బోస్, బిచ్చన్న, బొర్ర వెంకన్న, శంకరన్న, చంద్రన్న, పూనెం మంగయ్య, తెల్లం రాజు, జగన్, గణేష్, సనప కుమార్, రియాజ్, సింగన్న, పాపన్న పాల్గొన్నారు.

‘సూపర్’ సేవలేవి ?

మెడికల్ కాలేజీ ఉన్నా.. క్యాంపులు సున్నా

- మూడేళ్ల క్రితం వైద్య కళాశాల మంజూరు
- కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి బోధనాస్పత్రి హోదా
- అయినా.. ఏరియా ఆస్పత్రి స్థాయిని మించని వైద్యం



కొత్తగూడెం వైద్య కళాశాల (ఇన్‌సెట్)
కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బోధనాస్పత్రికి పెద్ద సంఖ్యలో పేషెంట్లు వచ్చేలా మెడికల్ కాలేజీ వర్గాల నుంచి సరైన చొరవ లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది. ఆధునిక వైద్య సేవలు జిల్లా చెంతకు వచ్చినా దాని ప్రయోజనాలు సామాన్యులకు అందడం లేదు. ప్రభుత్వ రంగంలో వైద్య సేవలను మూడు రకాలుగా విభజించారు. సాధారణ జ్వరం, దగ్గు, గాయాలు తదితర అనారోగ్య సమస్యల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పని చేస్తాయి. ఆపై స్థాయి వైద్య సేవలైన కళ్లు, దంత, కీళ్ల తదితర స్పెషాలిటీ వైద్య సేవల కోసం పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాల్లో ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. ఇక వైద్య విభాగంలో అత్యున్నత సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే బాధ్యతను మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉండే బోధనాస్పత్రులు నిర్వహిస్తాయి. ఇక్కడ సాధారణ చికిత్సల నుంచి గుండె, కిడ్నీ, న్యూరో తదితర విభాగాల్లో ఆధునిక వైద్య సేవల వరకు అందించాల్సి ఉంటుంది. 2022 – 23 విద్యా సంవత్సరంలో జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైంది. కొత్తగూడెంలోని ఏరియా ఆస్పత్రి, రామవరంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్) బోధనాస్పత్రులుగా మారాయి. దీంతో జిల్లాలో ఉన్న ఏజెన్సీ వాసులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్టే అనే భరోసా కలిగింది.

ఏరియా స్థాయిలోనే జీజీహెచ్..

మెడికల్ కాలేజీ వచ్చి మూడేళ్లు దాటినా ఇప్పటికీ కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రి (గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి - జీజీహెచ్)లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు కరువయ్యాయి. బోధనాస్పత్రిగా అప్‌గ్రేడ్ అయి మూడేళ్లు దాటినా ఇప్పటికీ ఏరియా ఆస్పత్రి తరహాలోనే వైద్య సేవలు అందుతున్నాయి. ఈ ఆస్పత్రికి వస్తున్న ఔట్ పేషెంట్ (ఓపీ) లెక్కలే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. జిల్లాలో ఇల్లెందు, అశ్వారావుపేట, మణుగూరు, బూర్గంపాడులో ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. సీజన్‌లో ఇక్కడ సగటున ప్రతీ రోజు 700 వరకు ఓపీ ఉంటోంది. ఈ ఆస్పత్రుల కంటే ఎన్నో రెట్లు పెద్దదైన కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో కూడా రోజువారీ సగటు ఓపీ 700 వద్దే నమోదవుతోంది. రామవరంలోని ఎంసీహెచ్ ఓపీని కలిపితేనే ఈ సంఖ్య వెయ్యి దాటుతోంది. బోధనాస్పత్రిగా ఉన్నప్పటికీ జిల్లా ప్రజలు కొత్తగూడెం ఆస్పత్రికి వచ్చేందుకు పెద్దగా ఆసక్తి చూపించడం లేదనడానికి ఈ గణాంకాలే నిదర్శనం.

కనిపించని చొరవ..

సాధారణంగా ప్రభుత్వ రంగంలో మెడికల్ కాలేజీలు ఏర్పాటైన తర్వాత పేషెంట్ల వద్దకే ఆస్పత్రి వర్గాలు వెళ్తాయి. ఇందుకోసం ప్రత్యేకంగా మారుమూల మండలాలు, గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తాయి. ఆధునిక వైద్య సేవలు ప్రభుత్వ స్థాయిలో అందుబాటులోకి వచ్చాయని ప్రజలకు తెలియజేస్తాయి. ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రామ్స్ స్వీకరిస్తాయి. అంతేకాదు మలేరియా డే, కేన్సర్ డే వంటి దినోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపడతాయి. ఇలాంటి చర్యల ద్వారా సాధారణ పేద ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను చేరువ చేస్తాయి. ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరగడంతో అక్కడ చదివే విద్యార్థులకు మరింత మెరుగైన శిక్షణ అందుతుంది. కానీ కొత్తగూడెం మెడికల్ కాలేజీ, సర్వజన ఆస్పత్రి నుంచి ఈ తరహా చొరవ కరువైంది. కేవలం కమ్యూనిటీ హెల్త్ ప్రోగ్రామ్స్.. అవి కూడా జిల్లా కేంద్రం చుట్టుపక్కల ప్రదేశాలకే పరిమితమయ్యాయి.

ఈ ఏడాదైనా మారేనా?

మెడికల్ కాలేజీ వచ్చి మూడేళ్లు కావొస్తున్నా ఆధునిక వైద్య సేవలను ఏజెన్సీ ప్రాంత గిరిజన ప్రజల చెంతకు తీసుకుపోయే విషయంలో దూకుడు కనిపించడం లేదు. ఇప్పటికే ఇక్కడ మూడు బ్యాచ్‌ల విద్యార్థులు ఉన్నారు. నాలుగో బ్యాచ్ వచ్చిన తర్వాత.. ఏడాదిలో హౌస్ సర్జన్లు (జూనియర్ డాక్టర్లు) కూడా ఇక్కడ అందుబాటులోకి వస్తారు. అప్పటికైనా ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని జిల్లాకు చెందిన వైద్య ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. అందుబాటులో ఉన్న ఏడాది కాలంలోనైనా ఈ ఆస్పత్రి ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ విభాగంలో సేవలు మెరుగుపరచాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఏడు వందలకు పైగా ఓపీ

ప్రస్తుతం సర్వజన ఆస్పత్రికి రోజువారీగా 700 పైగా ఓపీ ఉంటోంది. మాతాశిశు ఆస్పత్రితో కలిపితే ఈ సంఖ్య వెయ్యికి పైగానే ఉంటోంది. మెడికల్ కాలేజీ తరఫున క్యాంపులు నిర్వహిస్తున్నాం.

– రమేశ్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్, జీజీహెచ్

మెరుగైన చికిత్స అందించాలి

కేంద్ర ప్రభారి అధికారి సాల్మన్ ఆరోగ్యరాజ్



ములకలపల్లి : విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఆరోగ్యరాజ్, కలెక్టర్ పాటిల్

ములకలపల్లి : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని భారత ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల విభాగం అదనపు కార్యదర్శి, కేంద్ర ప్రభారి అధికారి సాల్మన్ ఆరోగ్యరాజ్ సూచించారు. ములకలపల్లి మండలంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలసి సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. తొలుత మంగపేట పీహెచ్‌సీని సందర్శించి పేషెంట్లకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అన్నిరకాల జబ్బులకు వైద్యం అందించాలని, అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆ తర్వాత మాధారంలో చెక్క బొమ్మల తయారీ యూనిట్‌ను సందర్శించాక కేజీబీవీని సందర్శించి విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. రాజుపేట, మూకమామిడి గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌజుపిట్టల యూనిట్లను, వెదురు, మునగ తోటలను పరిశీలించారు.

అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): అన్ని ప్రభుత్వ శాఖలు నిరంతర పర్యవేక్షణ, సమగ్ర సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని కేంద్ర ప్రభారి అధికారి సాల్మన్ ఆరోగ్యరాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం ఆకాంక్షిత జిల్లా అయినందున ప్రతీ అభివృద్ధి సూచికపై సమగ్ర దృష్టి సారించాలని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా కార్యాచరణ కొనసాగించాలని సూచించారు. అంతకుముందు కలెక్టర్ జితేష్ వి పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఔషధ మొక్కల పెంపకం, విద్యా ప్రమాణాల పెంపు వంటి తదితర అంశాలను తెలియజేశారు. తల్లీ పిల్లల ఆరోగ్యం, నూతన బ్లడ్ బ్యాంకుల స్థాపన, ఆధునిక వైద్య పరికరాల సమకూర్పు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య సేవల కల్పనపై దృష్టి సారించామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ విద్యాచందన, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, డీఐఈఓ వెంకటేశ్వరరావు, సీపీఓ సంజీవరావు, డీపీఓ బాబురావు, ఏఎంఓ నాగరాజశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మురళి, సాయికృష్ణ, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజు, డీఎస్‌ఓ ప్రభాకరరావు, మహిళా శిశుసంక్షేమ శాఖాధికారి స్వర్ణలత లెనినా, ఎల్‌బీఎం రాంరెడ్డి, ఉద్యాన శాఖాధికారి కిషోర్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధి హర్షణీయం..

భద్రాచలంఅర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ గిరిజన గ్రామాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తుండడం శుభ పరిణామమని సాల్మన్ ఆరోగ్యరాజ్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వసతులు, సౌకర్యాలు, మ్యూజియం తదితర ప్రాంతాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, సబ్‌కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్టతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని ఆదివాసీలు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సాధించడం అభినందనీయమన్నారు.

28 ఏళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు..

బాల్యంలో మందలించడంతో ఇల్లు వదిలి వెళ్లిన కుమారుడు



తల్లిదండ్రులతో హరి

టేకులపల్లి: తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి పారిపోయిన బాలుడు.. 28 ఏళ్ల తర్వాత కుటుంబం చెంతకు చేరిన ఘటన టేకులపల్లి మండలం మంగళితండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన లాకావత్ పంతులు–నాతి దంపతుల రెండో కుమారుడు హరి.. 1997లో కిన్నెరసాని గురుకుల పాఠశాలలో ఆరో తరగతి పూర్తయ్యాక వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చాడు. హరి బీడీలు తాగుతున్నాడని తెలియడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో భయాందోళనకు గురై తల్లి దాచుకున్న డబ్బు తీసుకుని ఇంటినుంచి పారిపోయాడు. కొత్తగూడెం, భద్రాచలం, ఖమ్మం హోటళ్లలో కొంత కాలం పని చేశాడు. ఖమ్మంలో పని చేస్తుండగా ఒకరోజు తండ్రి, మరుసటి రోజు సోదరి మామ కనిపించగా భయపడి కోదాడ చేరుకున్నాడు. అక్కడ కొంతకాలం పని చేశాక హైదరాబాద్ అమీర్‌పేటలో ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో పని చేశాడు. ఈ క్రమంలో బేగంపేటలో అద్దె ఇంట్లో ఉంటూ 2010లో ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం ఒక పాప, బాబు ఉండగా.. తల్లిదండ్రులపై ప్రేమానుబంధం పెరిగి వారిని కలిసేందుకు రెండు రోజుల క్రితం మంగళితండాకు వచ్చాడు. తల్లిదండ్రులు, తోబుట్టువులను కలిసి చిన్ననాటి జ్ఞాపకాలు పంచుకున్నాడు.

నకిలీ కొడుకు విఫల యత్నం

లాకావంత్ పంతులు కుమారుడు హరి బాల్యంలోనే ఇంటి నుంచి వెళ్లిపోయాడని తెలుసుకున్న ఓ సాధువు పదేళ్ల కిత్రం తానే హరినంటూ పంతులు ఇంటికి వచ్చాడు. అయితే కుమారుడి పోలికలు లేకపోయినా.. ఇన్నాళ్లు ఎదురుచూసిన తల్లిదండ్రులు అతడి మాటలు నమ్మి ఇంట్లోకి రానిచ్చారు. రెండు రోజుల తర్వాత అతడు హరి కాదని, నకిలీ అవతారం ఎత్తి వచ్చాడని కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో అతడు శ్రీశైలంలో పని ఉందంటూ చెప్పి వెళ్లిపోయాడు.

గ్రూప్-2లో గిరిజన యువకుడి ప్రతిభ



గుగులోత్ రామకృష్ణ

చంద్రుగొండ: మండలంలోని తుంగారం పంచాయతీ టేకులబంజర్ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు గుగులోత్ రామకృష్ణ గ్రూప్–2 ఉద్యోగం సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. రామకృష్ణ తల్లి లాలి రేషన్ డీలర్‌గా పనిచేస్తుండగా, తండ్రి కృష్ణ వ్యవసాయం చేస్తున్నాడు. రామకృష్ణ ఇంటర్ పూర్తయ్యాక అనారోగ్యానికి గురవడంతో చదువులు నిలిచిపోయాయి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఓపెన్ డిగ్రీ పూర్తి చేశాడు. పట్టుదలతో చదివి పది నెలల క్రితమే గ్రూప్–4లో ప్రభుత్వ కొలువు సాధించాడు. వారం రోజుల క్రితం వెల్లడించిన గ్రూప్–2 ఫలితాల్లో సెక్రటరియేట్‌లో అసిస్టెంట్ సెక్షన్ అధికారి (ఏఎస్‌ఓ) పోస్టుకు ఎంపికయ్యాడు. దీంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రామకృష్ణను గ్రామస్తులు అభినందించారు.

నోడల్ అధికారుల నియామకం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు వివిధ విభాగాల నోడల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ వనరుల నిర్వహణకు డీఈఓ బి.నాగలక్ష్మి, బ్యాలెట్ బాక్స్‌ల నిర్వహణకు డీఎంఓ నరేందర్, రవాణాకు ఆర్టీఓ వెంకటరమణ, శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు ఉపాధి కల్పనాధికారి కె. శ్రీరామ్, సామగ్రి నిర్వహణకు మైన్స్ ఏడీ జి.దినేశ్‌కుమార్, డీపీఓ కార్యాలయ అకౌంట్స్ అధికారి రమణారావు, ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు డీఆర్డీఓ ఎం.విద్యాచందన, జిల్లా ఆడిట్ అధికారి జి.శ్రీనివాస్, వ్యయ గణాంకాల సేకరణకు సీపీఓ సంజీవరావు, డేటా పర్యవేక్షణకు పరిశ్రమల మేనేజర్ మధుసూదన్ రెడ్డి, మోడల్ కోడ్ ఉల్లంఘన కేసుల పరిశీలనకు డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌చౌదరి, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారిగా డీసీఓ శ్రీనివాస్, పరిశీలకుల సమన్వయానికి డీసీఎస్‌ఓ త్రినాథ్‌బాబు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ పంపిణీకి డీఏఓ వి.బాబురావు, మీడియా కమ్యూనికేషన్, సమాచార ప్రసారానికి డీపీఆర్‌ఓ మొహమ్మద్ అజ్గర్ హుస్సేన్, ఫిర్యాదుల పరిష్కారానికి శ్రీరామ్ సుశీల్‌కుమార్, రిపోర్టులు, నివేదికల సమర్పణకు జెడ్పీ సీఈఓ బి. నాగలక్ష్మి, డిప్యూటీ సీఈఓ కె. చంద్రశేఖర్, వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణకు జె. సైదేశ్వరరావు, డీఐఈఓ వెంకటేశ్వరరావును నియమించినట్లు వివరించారు.

తనిఖీ బృందాలు చురుగ్గా పనిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చుంచుపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ బృందాలు చురుగ్గా పని చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు కొత్తగూడెం ఆనందఖని స్కూల్‌లో సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తనిఖీ బృందాలు 24 గంటలూ పర్యవేక్షణ చేయాలని, ఏదైనా సమాచారం అందితే వెంటనే అక్కడికి చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు నిబంధనలు పాటించాలని, ఏ అభ్యర్థికి, పార్టీకి అనుకూలంగా పని చేయొద్దని అన్నారు. ఎన్నికల్లో మద్యం, అక్రమ డబ్బు రవాణాను అరికట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.

రామన్నగూడెంలో భూ సర్వే షురూ..



గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్ : మండలంలోని రామన్నగూడెంలో సర్వే నంబర్లు 30, 36, 39లో గల 576 ఎకరాల వివాదాస్పద భూముల్లో రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యంలో సోమవారం సర్వే ప్రారంభించారు. ఈ భూములు తమవంటూ గిరిజనులు, రెవెన్యూ, అటవీ, ఎఫ్‌డీసీ(అటవీ అభివృద్ధి సంస్థ) మధ్య వివాదం సాగుతోంది. ఈ భూముల సాధనకు గిరిజనులు ఏళ్లుగా పోరాడుతున్నారు. ఇటీవల కలెక్టరేట్ వద్ద దర్నాచౌక్‌లో నిరవధిక దీక్ష కూడా చేపట్టారు. దీంతో స్పందించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్.. రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వేకు ఆదేశించగా తొలిరోజు హద్దు రాళ్లను గుర్తించే పనులు చేపట్టారు. ఆయా భూముల్లో తూర్పు వైపు ఉన్న హద్దు రాళ్లను నక్షా ప్రకారం గుర్తించగా, మరో మూడు వైపులా ఉన్న రాళ్లను గుర్తించాల్సి ఉంది. దీనిపై తహసీల్దార్ సీహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ.. వందల ఎకరాల భూమి కావడంతో సర్వే మరికొద్ది రోజులు పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కొత్తగూడెం, సత్తుపల్లి ఎఫ్‌డీసీ డీఎంలు చంద్రమోహన్, గణేష్, రేంజర్లు మురళి, చంద్రకళ, డిప్యూటీ రేంజర్ రవికుమార్, ఆర్‌ఐ తాటి కృష్ణ, సర్వేయర్ నాగరాజు, మాజీ సర్పంచ్ మడకం స్వరూప, గ్రామస్తులు మడకం నాగేశ్వరరావు, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

అతివలదే అగ్రభాగం

- ‘స్థానిక’ రిజర్వేషన్లలో మహిళలకు ప్రాధాన్యం
- సగానికి పైగా పదవులు వారికే..
- జిల్లా ఓటర్లలోనూ మహిళలే ఎక్కువ
- అప్పుడే వేడెక్కిన పల్లె రాజకీయాలు



శాసించేదీ నారీమణులే..

జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. దీంతో ఎన్నికలేవైనా శాసించేది వారే. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 471 పంచాయతీలు, 22 మండల పరిషత్ కార్యాలయాల్లో ఇటీవల ఓటర్ల జాబితాలను ప్రదర్శించి మొత్తం 6,69,048 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో పురుషులు 3,25,045 మంది, మహిళలు 3,43,979 మంది ఉన్నారు. ఇతరులు మరో 24 మంది ఉన్నారు. అన్ని మండలాల్లోనూ మహిళా ఓటర్లే అధికం. దీంతో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళల భాగస్వామ్యం పెరగనుంది.

చుంచుపల్లి : ఉద్యోగ, ఉపాధి రంగాలతో పాటు రాజకీయాల్లోనూ మహిళలు రాణిస్తున్నారు. ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికే ఎక్కువ అవకాశాలు దక్కాయి. దీంతో పంచాయతీ, జిల్లా, మండల పరిషత్‌లలో అతివల ప్రాతినిధ్యం పెరగనుంది. సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు సగం మహిళలకే రిజర్వ్ చేశారు. ఇక అభ్యర్థుల గెలుపోటములనూ వారే నిర్ణయించనున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ స్థానాల్లో సగం అతివలకే రిజర్వ్ కాగా గ్రామ పంచాయతీ, వార్డు స్థానాల్లోనూ మహిళలకే ప్రాధాన్యం దక్కింది. అయితే బీసీ సంఖ్య ఉన్న చోట మాత్రం వారు ఒక స్థానం కోల్పోవాల్సి వచ్చింది. ఇప్పటివరకు రాజకీయ అనుభవం లేకున్నా.. రిజర్వేషన్లు అనుకూలించినందున కుటుంబంలోని మహిళలను బరిలోకి దింపి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే నిర్ణయంతో పురుషులు ఉన్నట్లు తెలుస్తోంది.

గ్రామాల్లో మొదలైన సందడి..

స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగడంతో పల్లెల్లో రాజకీయం వేడెక్కింది. ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయగా దీనికి అనుగుణంగానే రిజర్వేషన్లు ఖరారు చేశారు. అయితే ఈసారి ఎలాగైనా పోటీ చేయాలని ప్రణాళికలు రూపొందించుకున్న పలువురికి రిజర్వేషన్లు అనుకూలంగా రాలేదు. మరి కొందరికి అనుకూలించడంతో ఎన్నికల బరిలో నిలిచేందుకు సై అంటున్నారు. అయితే ఈనెల 8న హైకోర్టు తీర్పు ఇవ్వనున్న నేపథ్యంలో ఆ తర్వాత రాజకీయం మరింతగా వేడెక్కనుంది. ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా తీర్పు వెలువడితే ఈ నెల 23, 27 తేదీల్లో 22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత 471 గ్రామ పంచాయతీలకు ఈ నెల 31, నవంబర్ 4, 8 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇందు కోసం ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ప్రారంభించాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు బీ–ఫారంపై పోటీ చేయాల్సి ఉండటంతో పార్టీలు గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్నాయి. పోటీకి దిగే ఆలోచనలో ఉన్నవారు మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక సర్పంచ్ ఎన్నికలు పార్టీ రహితంగా నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా స్థానాల్లో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు తమ ప్రయత్నాల్లో మునిగిపోయారు.

అభ్యర్థులు ఖర్చు లెక్క తప్పొద్దు

జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి

చుంచుపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులు చేసే ఖర్చు పరిమితికి మించొద్దని జెడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి అన్నారు. ఐడీఓసీలో సోమవారం వారు గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం జెడ్పీటీసీ అభ్యర్థులు రూ.4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులు రూ.1.50 లక్షలు, సర్పంచ్ అభ్యర్థులు గ్రామపంచాయతీ జనాభా ఆధారంగా రూ.1.50 లక్షలు లేదా రూ.2.50లక్షల వరకు ఖర్చు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 5వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి రూ.2.50 లక్షలు, వార్డు సభ్యులు రూ.50వేలు, 5 వేల జనాభా కంటే తక్కువ ఉన్న పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి రూ.1.50 లక్షలు, వార్డు సభ్యులు రూ.30,000 వరకు మాత్రమే ఖర్చు చేయాలన్నారు. డీపీఓ రాంబాబు మాట్లాడుతూ అభ్యర్థులు పోటీ చేసే ప్రాంతంలో రాజకీయ పార్టీలు చేసే ప్రచార ఖర్చులు కూడా ఆయా అభ్యర్థుల ఎన్నికల ఖాతాలోనే జమవుతాయని తెలిపారు. ప్రచారంలో వాహనాలు, మైక్ సెట్లు, పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాల వంటి ఖర్చులు సైతం లెక్కల్లో చూపించాలని సూచించారు. పోటీ చేసిన ప్రతీ అభ్యర్థి ఎన్నికల అనంతరం 45 రోజుల్లోపు తమ తుది ఖర్చు నివేదికలను సంబంధిత నియామక అధికారికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ జెడ్పీ సీఈవో చంద్రశేఖర్, ఆయా పార్టీల ప్రతినిధులు లక్ష్మణ్ అగర్వాల్, అనుదీప్, శ్రీనివాస్, నోముల రమేష్, సత్యనారాయణ, గొని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రెగళ్లపాడు కాంగ్రెస్ అభ్యర్థిగా సరోజిని


అభ్యర్థిని ప్రకటిస్తున్న మూడు పంచాయతీల కాంగ్రెస్ నాయకులు

టేకులపల్లి: మండలంలోని ప్రెగళ్లపాడు ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తాజా, మాజీ ఎంపీటీసీ బాణోతు సరోజినిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సోమవారం ముత్యాలంపాడులో నిర్వహించిన ప్రెగళ్లపాడు, రాంపురం, కొత్త తండా(పి) గ్రామ పంచాయతీల కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈమె 2006లో టీడీపీ నుంచి, 2019లో ఇండిపెండెంట్‌గా ఎంపీటీసీగా గెలిచారు. కాగా ఎంపీపీ పదవిని ఆశిస్తున్న వారిలో ఈమె కూడా ఉన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లక్కినేని శ్యాంబాబు, నూనావత్ బిక్కులాల్, అజ్మీర సూక్యా, లక్కినేని మురళి, కంది వెంకన్న, భూక్య లింబా, భూక్య గాంధీ, అంగోతు వినయ్, ముచ్చ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జిగా శ్రీనివాస్


శ్రీనివాస్‌కు నియామకపత్రం ఇస్తున్న కృష్ణయ్య

ఖమ్మం మామిళ్లగూడెం/కల్లూరు రూరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, సత్తుపల్లికి చెందిన నారాయణవరపు శ్రీనివాస్‌కు సంఘం భద్రాద్రి జిల్లా బాధ్యతలు కూడా అప్పగించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయనకు సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రం అందజేశారు. కాగా, బీసీ రిజర్వేషన్ల కోసం శ్రీనివాస్ ఆమరణ దీక్ష చేయడంపై అభినందించారు. నాయకులు గద్దె వెంకటరామయ్య, మరీదు ప్రసాద్‌గౌడ్, రాజేందర్, అనంతయ్య, రేగా రమేష్, రాజు కోటి, కర్రీ కమలాకర్, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

బూర్గంపాడు: పశువుల అక్రమ రవాణాను సోమవారం బూర్గంపాడు పోలీసులు అడ్డుకున్నారు. జింకలగూడెం గ్రామం నుంచి హైదరాబాద్‌కు లారీలో పశువులను అక్రమంగా తరలిస్తుండగా ఎస్‌ఐ నాగభిక్షం పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్న లారీ డ్రైవర్ జాకీర్‌ను, జింకలగూడెం గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీలో ఉన్న 32 పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించారు. జాకీర్, షేక్ ఇస్మాయిల్‌తో పాటు లారీ ఓనర్ ఖైజర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్షతగాత్రుడిని ఆస్పత్రిలో చేర్చిన ఎస్‌ఐ


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తీసుకొచ్చిన ఎస్‌ఐ


కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం సమీపంలోని శేషగిరినగర్ బోడగుట్టకు చెందిన ఖలీల్ పాషా బస్టాండ్ ప్రాంతంలోని ఆర్టీసీ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ట్రాఫిక్ ఎస్సై గడ్డం ప్రవీణ్ కుమార్ గమనించి పాషాను తన వాహనంలో తీసుకెళ్లి కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో చేర్చారు. ప్రథమ చికిత్స చేయించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐని పలువురు అభినందించారు.

గిరిజన దర్బార్‌లో దరఖాస్తుల స్వీకరణ


ఫిర్యాదు అందిస్తున్న గిరిజనులు

భద్రాచలంఅర్బన్: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఏపీఓ డేవిడ్ రాజ్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు భూముల పట్టాలు, ప్రభుత్వ పథకాల వర్తింపు, చికిత్స పొందేందుకు ఆర్థికసాయం, ఏజెన్సీ సర్టిఫికెట్ల కోసం పలువురు అర్జీ పెట్టుకున్నారని తెలిపారు. ఫిర్యాదుల వివరాలు నమోదు చేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిశాక దరఖాస్తులను పరిష్కరిస్తామని అన్నారు. విద్యుత్ శాఖ ఏపీఓ వేణు, కొండరెడ్ల విభాగం అధికారి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400

ప్రమాద బీమా రూ.10 లక్షలు

ప్రమాద బీమా మొత్తం మరింత పెరగడంతో కార్మిక కుటుంబాలకు ధీమా కలుగనుంది. కార్మిక సంక్షేమ శాఖ ద్వారా పేర్లు నమోదు చేసుకుని, లేబర్‌కార్డు పొందిన కార్మికులకు ఈ సదుపాయం వర్తిస్తుంది. భవన నిర్మాణ రంగంలో పని చేసే తాపీమేస్త్రీ, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, పెయింటర్లతోపాటు 14 రంగాల్లో పని చేసే కార్మికులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే అవగాహన లేకపోవడంతో ఎక్కువ మంది కార్మికులకు వినియోగించుకోలేకపోతున్నారు. –చర్ల

భవన నిర్మాణ కార్మిక కుటుంబాలకు ధీమా

- కార్మిక శాఖ వద్ద పేర్ల నమోదుతో ప్రయోజనం
- లేబర్ కార్డుతో పెళ్లిళ్లు, ప్రసవాలకూ ఆర్థికసాయం


భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

ఇవీ ప్రయోజనాలు

కార్మికులకు లేబర్ కార్డుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. సాధారణ మరణం సంభవిస్తే ఇప్పటి వరకు రూ 1.30 లక్షలు బీమా చెల్లిస్తుండగా, తాజాగా రూ.2 లక్షలకు పెంచారు. ప్రమాదవశాత్తు మరణిస్తే గతంలో రూ.6.30 లక్షలు బీమా చెల్లించేవారు. ప్రస్తుతం ఆ బీమాను రూ.10 లక్షలకు పెంచారు. ప్రమాదంలో పూర్తి అంగవైకల్యం సంభవించినా రూ.2 లక్షల బీమా చెల్లిస్తారు. లేబర్ కార్డు కలిగి ఉన్న కుటుంబంలో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున చెల్లిస్తారు. ప్రసూతి సహాయం కింద ఇద్దరు పిల్లలకు రూ.30 వేల చొప్పున చెల్లిస్తారు. పెళ్లిళ్ల సమయంలో కూడా ఆర్థికసాయం అందిస్తారు.


దమ్మపేటలో పెయింటింగ్ వర్కర్లకు లేబర్‌కార్డులను అందజేస్తున్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (ఫైల్)

సంప్రదించాల్సిన అధికారులు

పేర్ల నమోదు, బీమా చెల్లింపులు తదితర వ్యవహారాలను పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఉండగా, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు, కొత్తగూడెం ప్రాంతాల్లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు ఉన్నారు. కొత్తగూడెం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పరిధిలో కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, చంద్రుగొండ, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, జూలూరుపాడు మండలాలు ఉన్నాయి. మణుగూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పరిధిలో మణుగూరు, పినపాక, బూర్గంపాడు, పాల్వంచ, అశ్వాపురం, కరకగూడెం మండలాలు, ఇల్లెందు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పరిధిలో ఇల్లెందు, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాలు, భద్రాచలం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పరిధిలో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాలు ఉన్నాయి.

93,216 మంది కార్మికుల నమోదు

జిల్లాలో కార్మిక శాఖవద్ద భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పని చేస్తున్న వారిలో 93,216 మంది కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో ఇప్పటి వరకు 2061 మంది కార్మికులు వివిధ రకాలుగా లబ్ధి పొందారు. రూ.10,42128లను ప్రభుత్వం నుంచి సాయంగా అందుకున్నారు.

నమోదు ఇలా..

లబ్ధిదారులు నిర్ణీత ఫారంలో వివరాలను పొందుపరిచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సంక్షేమ పథకాల ద్వారా చేకూరే లబ్ధి కోసం తమపై ఆధార పడి ఉన్న కుటుంబ సభ్యుల వివరాలు, నామిని పేరును దరఖాస్తు ఫారంలో తప్పని సరిగా పొందుపరచాలి. దరఖాస్తుతో పాటు నిర్మాణ రంగంలో పని చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం జత చేయాలి.

ధ్రువీకరణ

కార్మికులు, నిర్మాణ రంగ సంఘాల అభ్యర్థనతో సభ్యత్వం, బీమా పత్రాలను కార్మికశాఖలో సహాయ కార్మిక అధికారి స్థాయికి తక్కువకానీ అధికారి ధ్రువీకరిస్తారు. కార్మికుడు తమ సంస్థలో పనిచేస్తున్నట్లు కార్మిక చట్టపరిధిలో నమోదు చేసిన నిర్మాణ సంస్థ, యజమాని ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయవచ్చు. నిర్మాణ రంగంలో ఉన్న ప్రభుత్వ సంస్థలు కూడా ధ్రువీకరించవచ్చు.

ప్రమాద బీమా పెంచుతూ జీఓ



కార్మికులకు ప్రమాద బీమా పెంచుతూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. రూ. 6.30 లక్షల నుంచి రూ. 10 లక్షలకు బీమా పరిహారం పెంచింది. కార్మిక శాఖ ద్వారా పేర్లు నమోదు చేసుకుని లేబర్‌కార్డు పొందిన ప్రతీ కార్మికుడు ప్రయోజనం పొందవచ్చు. అర్హులైన కార్మికులు ఆన్‌లైన్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలి. ఇతర వివరాల కోసం కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు పట్టణాల్లోని కార్యాలయాల్లో సంప్రదించాలి.

– ఎండీ షరీపుద్దీన్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, కొత్తగూడెం

కోటమైసమ్మ జాతర ఆదాయం రూ.29.10లక్షలు

గత ఏడాది కంటే రూ.1.92లక్షలు ఎక్కువ


నగదును లెక్కిస్తున్న సిబ్బంది

కారేపల్లి: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని కారేపల్లి మండలం ఉసిరికాయపల్లిలో నిర్వహించిన శ్రీ కోటమైసమ్మతల్లి జాతర సోమవారంతో ముగిసింది. ఈమేరకు భక్తులు సమర్పించిన కానుకలను దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఈఓ కె.వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు ఆధ్వర్యాన సోమవారం లెక్కించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన జాతర ద్వారా మొత్తం రూ.29,10,386 ఆదాయం సమకూరగా, హుండీల ద్వారా రూ.7,41,764 కానుకలు వచ్చాయని వెల్లడించారు. గత ఏడాది జాతర ఆదాయం రూ.27,17,949కాగా ఈ ఏడాది రూ.29,10,386 రావడంతో రూ.1.92లక్షల మేర పెరిగినట్లయింది. అలాగే, గత ఏడాది హుండీల ద్వారా రూ.7,33,549 వస్తే ఈసారి రూ.8,215 పెరిగి రూ.7,41,764గా నమోదైంది. ఇక పూజా టికెట్ల ద్వారా గత ఏడాది రూ.5,51,700, ఈ ఏడాది రూ.4,95,290, షాపుల వేలం ద్వారా గత ఏడాది రూ.8,34,000, ఈ ఏడాది రూ.9,64,500 ఆదాయం వచ్చింది. లెక్కింపులో దేవాదాయ శాఖ సిబ్బంది పగడాల మోహన్‌కృష్ణ, తోటకూరి వెంకటేశ్వర్లు, పర్సా సాయిలలిత్, మూడ్ మోహన్‌చౌహాన్, బోడ బన్సీలాల్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను విద్యార్థినికి అప్పగిస్తున్న పోలీసులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని యానంబైల్ గ్రామానికి చెందిన కుంజా అర్చన పాల్వంచలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. సోమవారం కళాశాల నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో తన స్మార్ట్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ సురేష్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సెల్‌ఫోన్ పడిపోయిన లొకేషన్‌ను గుర్తించారు. వెతికి తీసుకొచ్చి విద్యార్థినికి అందజేశారు. పది నిమిషాల వ్యవధిలోనే సెల్‌ఫోన్‌ను వెతికి ఇచ్చిన పోలీసులకు విద్యార్థిని కృతజ్ఞతలు తెలిపింది.

అండర్-19 టీ.టీ. జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 జూనియర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ జట్లను సోమవారం ఎంపిక చేశారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ చాటిన వారితో బాలబాలికల జట్లను ఎంపిక చేయగా, త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీ.వీ.ఎస్. మూర్తి, క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసీ కలీం తెలిపారు. కాగా, బాలుర జట్టుకు పి.మోహిత్‌కృష్ణ, ఈ.తరుణ్, జి. జెస్సీ, ఏ.వివేక్, కె.శశాంక్, టి.అఖిలేష్, బాలికల జట్టుకు జి.చంద్రికరాణి, కె.నవ్య, జి.షర్మిల, టి.శ్రీఅమృత, వి.సుప్రియ, శౌర్య ఎంపికయ్యారని వెల్లడించారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: కోడి పందేల స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై యయాతీ రాజు కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని పోకలబజార్‌లో కోడి పందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.10,600 నగదు, ద్విచక్రవాహనం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని, పరారైన మరికొందరిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్సై తెలిపారు.

భార్యను హతమార్చిన భర్త


సునీత(ఫైల్)

జూలూరుపాడు: అనుమానంతో భార్యను భర్త హతమార్చిన ఘటన మండలంలోని పాపకొల్లు గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పాపకొల్లు గ్రామ పంచాయతీ ముత్యాలమ్మకాలనీకి చెందిన ధరావత్ గోపికి 17 ఏళ్ల క్రితం టేకులపల్లి మండలం ముత్యాలంపాడుకు చెందిన సునీత(37)తో వివాహం జరిగింది. వీరికి ఇంటర్ ఫస్టియర్, 9వ తరగతి చదువుతున్న ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య సునీతపై అనుమానంతో గోపి కొంతకాలంగా గొడవ పడుతున్నాడు. సోమవారం ఉదయం భార్యను బైక్‌పై ఎక్కించుకుని పత్తి చేనుకు వెళ్లాడు. చేలో కంప నరకాలని తన వెంట కోట కత్తి కూడా తీసుకెళ్లాడు. భార్యతో ఘర్షణ పడి ముఖంపై కోట కత్తితో నరికి చంపాడు. కాగా ఉదయం చేనుకు వెళ్లిన తల్లిదండ్రులు సాయంత్రం చీకటి పడినా ఇంటికి రాలేదని కుమార్తెలు ముత్యాలమ్మకాలనీలోని తాతయ్య వాళ్ల ఇంటికి వెళ్లి చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు చేనుకు వెళ్లి చూడగా సునీత రక్తమడుగులో చనిపోయి ఉండటంతో కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఎస్‌ఐ బాదావత్ రవి సిబ్బందితో సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సునీత మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అయితే భార్యను హత్య చేసిన గోపి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.

గుండెపోటుతో ఏసీపీ విష్ణుమూర్తి మృతి


సబ్బతి విష్ణుమూర్తి (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన, ఆసిఫాబాద్ ఏసీపీ సబ్బతి విష్ణుమూర్తి(59) హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మంగళవారం వెంగన్నపాలెంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఏసీపీ మృతికి ఆయన బాల్యమిత్రుడు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ ఒక ప్రకటనలో సంతాప తెలిపారు. విద్యార్థి దశలో విష్ణుమూర్తితో ఉన్న సాన్నిహిత్యం, స్నేహాన్ని వెంకట్ గుర్తు చేసుకున్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

పాల్వంచ: ఒంటరి తనంతోపాటు, మద్యానికి బానిసై ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కరకవాగుకు చెందిన బాదావత్ పవన్ (22) తల్లిదండ్రులు చిన్న తనంలోనే అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి పెదనాన్న భద్రు వద్ద ఉంటున్నాడు. ఇటీవల కాలంలో మద్యానికి బానిసగా, పలుమార్లు కుటుంబ సభ్యులు మందలించారు. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఒంటరి తనం తాళలేక ఈనెల 5న ఎలుకల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించి ఇంటికి తీసుకొచ్చారు. తిరిగి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల కింద ఉండే ఇనుప పైపునకు చున్నీతో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పవన్ సోదరి ఇటీవలే ప్రేమ వివాహం చేసుకుంది.

చెరువులో పడి బాలిక..



టేకులపల్లి: తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక సోమవారం చెరువులో పడి మృతి చెందింది. టేకులపల్లి ఎస్‌ఐ ఎ.రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని చుక్కాలబోడు పంచాయతీ జేత్యాతండాకు చెందిన లాకావత్ మంగీలాల్, జ్యోతి దంపతుల కుమార్తె వర్షిత (13) బూర్గంపాడు గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన విద్యార్థిని సోమవారం తోటి బాలికలతో కలిసి గ్రామ సమీపంలోని తెల్లవాగు వద్దకు వెళ్లింది. ఆడుకుంటున్న సమయంలో వర్షిత కాలు జారి చెరువులో పడి మునిగి పోయింది. దీంతో గ్రామంలోకి పరుగులు తీసిన మిగిలిన బాలికలు భయంతో విషయం ఎవరికీ చెప్పలేదు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు కుమార్తె కనిపించకపోవడంతో వెతకగా, చెరువులో బాలిక మృతదేహం కనిపించింది. ఎస్‌ఐ రాజేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. బాలిక మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

అస్థి పంజరం లభ్యం

గ్రామానికి చెందిన సిద్ధి రవికుమార్‌దిగా అనుమానం..?

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడులో ఉన్న మామిడితోటలో గ్రామస్తులు మానవ అస్థి పంజరాన్ని సోమవారం గుర్తించారు. కాగా గ్రామానికి చెందిన సిద్ధి రవికుమార్ ఆగస్టు 26న రాత్రి 7.30 గంటల సమయంలో తన స్నేహితుడు దాసరి ప్రశాంత్ ఇంటి వద్ద భోజనం చేసిన తర్వాత నుంచి అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల దగ్గర వెతికినా ఆచూకీ లేదు. దీంతో అదే నెల 31న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా అస్థి పంజరం సిద్ధి రవికుమార్‌దని అనుమానాలు వ్యక్తం చేస్తూ గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై సీఐ వెంకటప్పయ్యను వివరణ కోరగా.. విషయం తెలిసిందని విచారణ జరుపుతామని తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ పార్క్ ఎదురుగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయం నుంచి పాత సెంటర్ ప్రభుత్వ పాఠశాలకు సోమవారం విద్యార్థులు వెళ్తుండగా వీధికుక్కలు వెంబడించాయి. రెండో తరగతి విద్యార్థులు అబ్దుల్‌రషీద్, జి.శ్రావణ్‌కుమార్‌ను కరవడంతో గాయాలయ్యాయి.

ప్రజాస్వామ్యశక్తులతో కలిసి పోటీ చేస్తాం

సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాను యూనిట్‌గా తీసుకుని స్థానిక సంస్థల పోరులో వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పోటీ చేసేందుకు తమ పార్టీ సుముఖంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. బీజేపీకి వ్యతిరేకంగా కలిసొచ్చే లౌకిక పార్టీలతో అవగాహన కుదుర్చుకుంటామని, అలా వీలుకాని పక్షంలో ఒంటరిగా పోటీ చేస్తామని పేర్కొన్నారు. సోమవారం మంచికంటి భవన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో తాము 120 సర్పంచ్, 80 ఎంపీటీసీ, ఆరు జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపారు. ఈ ప్రతిపాదన ఒప్పుకునే పార్టీలతో కలిసి పనిచేస్తామన్నారు. గతంలో తమ పార్టీ గెలిచిన స్థానిక సంస్థలను ఆదర్శంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఆదర్శ గ్రామపంచాయతీ అవార్డులు కూడా పొందామన్నారు. సీపీఎం అభ్యర్థులు గెలిచిన చోట్ల గ్రామాభివృద్ధే లక్ష్యంగా సుపరిపాలన ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అన్నవరపు సత్యనారాయణ, బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గెంటేసిన కుమారుడు


కుమారుడు గెంటేయడంతో రోడ్డుపై కూర్చున్న తల్లిదండ్రులు

భద్రాచలంఅర్బన్: ఓ వ్యక్తి కన్న తల్లిదండ్రులను ఇంటిని గెంటివేసిన ఘటన భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఆది వారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన రాంబాబు, మంగాదేవి దంపతులకు కుమారుడు వెంకటేష్ ఉన్నాడు. రాంబాబు గతంలో బజ్జీలు అమ్ముతూ జీవనం సాగించేవాడు. గుండెకు శస్త్రచికిత్స కావడంతో ప్రస్తుతం ఇంట్లోనే ఉంటున్నాడు. అతని భార్య మంగాదేవి మాత్రం ఇళ్లలో పని చేస్తోంది. కాగా ఆదివారం తల్లిదండ్రులను కుమారుడు ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. ఆ దంపతులు రోడ్డు మీద ఉండటంతో గమనించిన పక్కింటి వారు ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రించేందుకు చోటు ఇచ్చారు. దీంతో కుమారుడు పక్కింటి వారినీ దుర్భాషలాడుతూ సోమవారం గొడవకు దిగడంతో స్థానికులు అడ్డుకున్నారు. రాంబాబు, మంగాదేవి స్థానికులతో కలిసి పోలీసులను ఆశ్రయించగా, కాగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

గొత్తికోయ గుంపుల్లో తనిఖీలు


గిరిజనుల నివాసంలో తనిఖీ చేస్తున్న వైల్డ్‌లైఫ్ సిబ్బంది

పాల్వంచరూరల్: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా సోమవారం కిన్నెరసాని అభయారణ్యం పరిధిలోని గొత్తి కోయగుంపుల్లో అటవీశాఖ అధికారులు తనిఖీ చేశారు. మందెరకలపాడు, చిరుతానిపాడు, పెద్దకలశ, రాళ్లచెలక తదితర ఆదివాసీల గ్రామాల్లో నివాసాలను వైల్డ్‌లైఫ్ అధికారులు, సిబ్బంది సోదా చేశారు. ఉచ్చులు, బాణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌డీఓ బాబు తెలిపారు. వన్యప్రాణులను సంరక్షించాలని అవగాహన కల్పించినట్లు వివరించారు.

కలప స్మగ్లర్.. సూర్యాపేట వాసి

ఖమ్మం జిల్లా నుంచి తప్పుడు సమాచారంతో ఎన్‌ఓసీలు

- ఆపై విలువైన సంద్ర కలప అక్రమ రవాణా
- ఎన్‌ఓసీల సృష్టికర్త చింతకాని బీట్ ఆఫీసర్

ఖమ్మంవ్యవసాయం: కలప రవాణాకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, అందులోని లొసుగుల ఆధారంగా సాధారణ కలప స్థానంలో విలువైన సంద్ర కలపను రవాణా చేసిన స్మగ్లర్‌ను ఎట్టకేలకు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ స్మగ్లర్ విలువైన కలపను నకిలీ ధ్రువపత్రాలతో పొరుగు రాష్ట్రాలకు రవాణా చేస్తున్నట్లు విచారణలో తేల్చారు. నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్(ఎన్‌టీపీఎస్) విధానాన్ని ఆసరాగా చేసుకుని అనుమతి ఉన్న కలప మాటున విలువైన కలపను ఉత్తరాది రాష్ట్రాలకు తరలిస్తున్న వ్యవహారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అటవీ అధికారుల తనిఖీల్లో బయటపడింది. ఆపై తీగ లాగితే డొంక కదిలిన చందంగా వ్యవహారమంతా బయటకు వచ్చింది. ఈమేరకు వివరాలను సోమవారం ఖమ్మం జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ వెల్లడించారు.

గతనెల 24నుంచి విచారణ

ఖమ్మం జిల్లా నుంచి సాధారణ కలపను రవాణా చేసేందుకు ఎన్‌టీపీఎస్ ద్వారా విచారణ తీసుకుని విలువైన సంద్ర కలపను ఉత్తరాది రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. ఈ కలపను అక్కడి పాన్ మసాలా తయారీ ఫ్యాక్టరీల్లో ఉపయోగిస్తుండగా మధ్యప్రదేశ్‌లో చేపట్టిన తనిఖీల్లో అక్రమాలు బయటపడ్డాయి. దీంతో ఆ రాష్ట్ర అధికారులు ఇచ్చిన సమాచారంతో ఖమ్మం జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ నేతృత్వాన గతనెల 24 నుంచి విచారణ చేపట్టారు. ఈమేరకు సూర్యాపేట జిల్లాకు చెందిన కలప స్మగ్లర్ చింతకాని ఇన్‌చార్జి బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ ద్వారా కలప రవాణాకు సంబంధించి ఎన్‌ఓసీ తీసుకుని విలువైన కలప అక్రమ రవాణా చేసినట్లు తేల్చారు. మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి సంద్ర కలప సేకరించగా.. ఆపై చింతకాని మండలం నుంచి సర్కారీ తుమ్మ తరలిస్తున్నట్లు అనుమతి తీసుకుని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి పంపించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన స్మగ్లర్ అదే జిల్లా మోతె మండలానికి చెందిన ఓ లారీ ఏజెంట్ సహకారంతో కలపను ఉత్తరాది రాష్ట్రాల్లో ఉన్న పాన్ మసాలా పరిశ్రమలకు తరలిస్తుండగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝబువా, అలీపూర్ జిల్లాల్లో గుర్తించారు. కలప డీలర్లు, ప్రైవేట్ ఏజెంట్లతో చేయి కలిపినట్లు తేలడంతో ఇప్పటికే చింతకాని బీట్ ఆఫీసర్ శ్రీకాంత్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. కాగా, కలప అక్రమ రవాణా వ్యవహారంపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అయితే, ఖమ్మం జిల్లా పేరిట అనుమతి తీసుకున్నా సంద్ర కలప సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి తరలించినట్లు తేలడంతో ఆయా జిల్లాల అధికారులకు సమాచారం ఇచ్చారు. అంతేకాక ఉన్నతాధికారులకు ఖమ్మం డీఎఫ్‌ఓ నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మూడు జిల్లాల అధికారులకు సమాచారం ఇచ్చారు.